సాక్షి ప్రకాశం

సోమవారం । 19 । మే । 2025



ట్రాన్స్‌ఫార్మర్లపై పిడుగుపాటు.. రైతుకు చేటు

ఇటీవల జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లపై పిడుగులు పడి రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. - 8లో..



దివ్యాంగులకు బదిలీల తిప్పలు

కొన్ని నిబంధనల కారణంగా ఉపాధ్యాయ బదిలీల్లో దివ్యాంగులకు అన్యాయం జరుగుతోంది. వారంతా హైకోర్టును ఆశ్రయించారు. నిబంధనలు సడలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35/25

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటిరెండు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలి

● సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు



మాట్లాడుతున్న చుండూరు రంగారావు


ఒంగోలు సిటీ: లేబర్ కోడ్‌లు అమలు చేయడానికి అన్ని రాష్ట్రాలు విధివిధానాలు తయారు చేయాలని కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసి చాలా మొండిగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీ సమ్మె చేపట్టి విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరు రంగారావు మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నిర్వహించాలనుకున్న దేశ వ్యాప్త సమ్మెను జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఆ మేరకు అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు నిర్ణయించినట్లు చెప్పారు. జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జిల్లాలో విజయవంతం చేయాలని ఉద్యోగులు, కార్మికులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత్-పాకిస్థాన్ యుద్ధం ప్రారంభమై ముగించడం, ఉత్తరాది రాష్ట్రాల్లో కొన్ని ఉద్రిక్తల కారణంగా ఈ నెల 15వ తేదీ అఖిలపక్ష కార్మిక సంఘాలు సమావేశమై 20వ తేదీ సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లు అమలు చేయడంలో వెనకాడటం లేదన్నారు. అందుకు నిరసనగా 20వ తేదీ అవకాశం ఉన్నచోట నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ జిల్లాలోని ఒంగోలు నగరం, మున్సిపల్ పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లో ఈ నెల 20వ తేదీ సభలు, ప్రదర్శనలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.మోహన్, ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి సాయి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు, ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు రంగారావు, ఎల్ఐసీ డివిజన్ నాయకుడు పారా శ్రీనివాసరావు, న్యూ నాయకుడు సారధి, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పునరావాసం..

ముంచేశారు..!

ఇళ్లూ..ఊళ్లూ ఇచ్చినా.. అరణ్యరోదనే..

కరువు ప్రాంత వరప్రదాయని వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల జీవనం దుర్భరంగా మారింది. ఊళ్లను, ఇళ్లను విడిచి పునరావాస కాలనీలకు వెళ్లేందుకు సిద్ధమైనా.. వాటిలో మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ భూములిచ్చిన వారి త్యాగాలకు విలువ లేకుండా చేస్తోంది. ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద వారికి చెల్లించాల్సిన పరిహారంపై పరిహాసమాడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పునరావాస కాలనీల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై కూడా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. నిర్వాసితులపై కక్ష సాధిస్తోంది.



ముంపునకు గురవుతున్న గొట్టిపడియ గ్రామం

- వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల గోడు పట్టని పాలకులు
- కూటమి ప్రభుత్వంలో పునరావాస కాలనీల్లో పడకేసిన నిర్లక్ష్యం
- అధికారం చేపట్టి పదినెలలు గడుస్తున్నా కాలనీల్లో ఒక్క పని కూడా చేపట్టని వైనం
- మంత్రులు వచ్చి ప్రగల్భాలు పలికి 8 నెలలు గడుస్తున్నా కానరాని పురోగతి
- ముంపు గ్రామాల ప్రజల త్యాగాలకు విలువేదంటూ ప్రభుత్వంపై విమర్శలు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లు, భవనాల నిర్మాణం

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపు గ్రామాల ప్రజలకు సంబంధించిన పునరావాస కాలనీల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాలనీల్లో గుడి, బడి, అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటర్ ట్యాంకులు, పంచాయతీ భవనాలు, సిమెంటు రోడ్లు నిర్మించింది. పలు కాలనీల్లో గృహ నిర్మాణాలకు పూనుకున్నప్పటికీ ఎన్నికల కోడ్ అడ్డురావడంతో నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పునరావాస కాలనీల్లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయని ముంపు గ్రామాల ప్రజలు ఆశపడ్డారు. పది నెలలు దాటినప్పటికీ అభివృద్ధి పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ముంపు గ్రామాల ప్రజల త్యాగానికి గుర్తింపు లేకుండా పోయింది. గతేడాది అక్టోబర్ 29వ తేదీ ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర మంత్రుల బృందం వెలిగొండ టన్నెల్‌ను పరిశీలించి పనులు త్వరగా పూర్తిచేస్తామని, పునరావాస కాలనీల్లో పనులు చేపడతామని ప్రగల్భాలు పలికారు. వారు వచ్చివెళ్లి దాదాపు ఏడు నెలలు గడుస్తోంది. కానీ, నేటికీ ఒక్క పని కూడా జరగకపోవడంతో నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం సమాధానంపై ముంపు గ్రామాల ప్రజల ఆందోళన...

ఈ ఏడాది మార్చి 8వ తేదీ మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెలిగొండపై మహిళలు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన సమాధానం పట్ల ముంపు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన మాటనే ఇప్పుడు కూడా చెప్పడం.. ఎప్పుడు పూర్తి చేస్తారో స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుతం నిర్వాసితుల కాలనీలో పెరిగిన పిచ్చిచెట్లు

ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్..

మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో మొత్తం 11 గ్రామాలు వెలిగొండ ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా తాతలనాటి ఊర్లను వదిలి ఇళ్లు, పొలాలను త్యాగంచేసి బయటకు వచ్చేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కానీ, ప్రభుత్వం చిన్నచూపు చూస్తుండడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వీరందరూ తమకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాస కాలనీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ముంపు గ్రామం	నిర్వాసితుల సంఖ్య
కలనూతల	1118
చింతలముడిపి	88
సుంకేశుల	2901
గుండంచర్ల	1201
కాటంరాజుతండా	38
అక్కచెరువు	158
గొట్టిపడియ	1420
సాయిరాంనగర్	26
రామలింగేశ్వరపురం	36
కృష్ణానగర్	78
పొట్టిబసవాయిపల్లి (లక్ష్మీపురం)	206

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం ఇలా...

పశ్చిమ ప్రకాశంలో శాశ్వతంగా కరువు నివారించడంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో సుమారు నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగునీరు, 16 లక్షల మంది ప్రజలకు తాగునీటిని అందించే వెలిగొండ ప్రాజెక్టుపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్కాపురానికి వచ్చిన చంద్రబాబు.. తాను అధికారంలోకి రాగానే వెలిగొండ ప్రాజెక్టుకు అత్యధిక నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేస్తానని చెప్పారు. ప్రజలందరూ నమ్మారు. ఈ నెలలో శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేవలం 309.13 కోట్ల రూపాయలను మాత్రమే వెలిగొండ ప్రాజెక్టుకు కేటాయించడం పట్ల సర్వత్రా నిరసన, ఆగ్రహం వ్యక్తమవుతున్నాయి. మరోసారి తమను కూటమి ప్రభుత్వం మోసం చేసిందనే భావన ముంపుగ్రామాల ప్రజల్లో ఏర్పడింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల ప్రజల పునరావాస కాలనీలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పనులు వేగవంతంగా జరిగాయి. అయితే, గతేడాది మార్చిలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దృష్టి సారించకపోవడంతో తొమ్మిది నెలల నుంచి పునరావాస కాలనీల్లో పిచ్చిచెట్లు, చిల్లచెట్లు మొలిచి పెద్దవై అరణ్యాన్ని తలపిస్తున్నాయి. విషసర్పాలు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

ప్రాజెక్టు పరిధిలో 11 ముంపు గ్రామాలు...

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గొట్టిపడియ, సుంకేశుల, కాకర్ల డ్యామ్‌లను దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పూర్తి చేశారు. గ్యాప్‌ల నిర్మాణంలో భాగంగా మూడు గ్యాప్‌ల పరిధిలో మొత్తం 11 గ్రామాలను ఖాళీ చేయిస్తున్నారు. ఆయా గ్రామాల్లో 7,270 కుటుంబాలు ఉన్నాయి.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇడుపూరు వద్ద కలనూతల గ్రామస్తుల కోసం నిర్మించిన ట్యాంక్

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధి ఇలా...

మార్కాపురం మండలం గొట్టిపడియ, అక్కచెరువు తండా నిర్వాసితులకు మార్కాపురం మండలం కుంటవద్ద కాలనీ ఏర్పాటు చేశారు. పెద్దారవీడు మండలం సుంకేశుల, కలనూతల, చింతలముడిపి గ్రామాల వారికి గోగులదిన్నె వద్ద, సుంకేశులలోని ఎస్సీలకు తోకపల్లి, కలనూతలలో, మరికొంతమంది నిర్వాసితులకు ఇడుపూరు వద్ద కాలనీలు ఏర్పాటు చేశారు. వాటిలో సిమెంటు రోడ్లు, వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ హాలు, పాఠశాలలు నిర్మించారు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా కాలనీలను పట్టించుకోకపోవడంతో వాటిలో చిల్లచెట్లు, పిచ్చికంప నిండిపోయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. దీంతో నిర్వాసితుల్లో ఒకరకమైన నిరాశ, నిస్పృహలు ఏర్పడ్డాయి. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు చూసి ఇప్పట్లో వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాదని, తమ సమస్య పరిష్కారం అయ్యేలా లేదని నిర్వాసితులు నైరాశ్యంలోకి ఉండిపోయారు.



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గొట్టిపడియ నిర్వాసితుల కాలనీలో నిర్మించిన సిమెంటు రోడ్డు



గత ప్రభుత్వంలో ఇడుపూరు వద్ద కలనూతల గ్రామస్తుల కోసం నిర్మించిన దేవాలయం



గత ప్రభుత్వంలో నిర్వాసితుల కాలనీలో నిర్మించిన పాఠశాల భవనం

పునరావాస పనులు వెంటనే ప్రారంభించాలి



పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలి. వెలిగొండ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి. నాటి ఒప్పందం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ 14 లక్షల రూపాయలతో పాటు పునరావాస కాలనీల్లో పక్కా గృహం కట్టించి ఇవ్వాలి.

– తుమ్మా వెంకటరెడ్డి, గొట్టిపడియ, మార్కాపురం మండలం

30 ఏళ్లుగా చంద్రబాబుది అదే మాట



గత 30 ఏళ్లుగా చంద్రబాబు వెలిగొండపై చెప్పిందే చెబుతున్నారు. ప్రాజెక్టు నిర్వాసితుల కోసం అదనపు నిధులు కేటాయించడం గురించి ఒక్క మాట కూడా మాట్లాడటంలేదు. పడికట్టు పదాలు తప్ప మరో మాట లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పునరావాస కాలనీల్లో పనులు వేగవంతం చేయాలి. వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలి. బడ్జెట్‌లో 2 వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలి.

– సోమయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, మార్కాపురం

మండుటెండలో మోకాళ్లపై నిలబడి..

● సమస్యల పరిష్కారం కోసం సీహెచ్‌ఓల నిరసన ర్యాలీ, మానవహారం

ఒంగోలు సిటీ: కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓలు) తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా ఆదివారం 20వ రోజు మండుటెండలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నుంచి చర్చి సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ మానవహారంగా ఏర్పడి మోకాళ్లపై నిలబడి ప్లకార్డులు ప్రదర్శించారు. ఆరు సంవత్సరాలు పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని, తమ డిమాండ్లపై చర్చించేందుకు ప్రభుత్వం ఆహ్వానించాలని నినాదాలు చేశారు.

శ్రమకు తగిన వేతనం ఇవ్వాలి...

సీహెచ్‌ఓల నిరసన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎంసీపీ) రాష్ట్ర కార్యదర్శి బిద్రు సందీప్‌కుమార్, రాష్ట్ర కో ఆర్డినేటర్ వినోద్ కుమార్‌నాయక్ మాట్లాడుతూ సీహెచ్‌ఓలకు శ్రమకు తగిన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.40 వేలు అని చెప్పి సర్క్యులర్ ఇచ్చినా.. రూ.25 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారని విమర్శించారు. గ్రామీణ కొండ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ లేనిచోట పనిచేస్తుంటే ఎఫ్‌ఆర్‌ఎస్ అని చెప్పి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు మాత్రమే జీతాలు కట్ చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ జీవో నంబర్ 64తో ఇచ్చిన 23 శాతం హైక్ వెంటనే అమలుచేయాలని కోరారు. సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పది వేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గ్రామీణ, కొండ ప్రాంతాలతో పాటు మారుమూల గ్రామాల్లో సేవలు అందిస్తున్నారన్నారు. ఒక్కో జిల్లా పరిధిలో 500 మంది వరకు పని చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 8 నుంచి 9 వేల మంది మహిళలు పనిచేస్తున్నారన్నారు. మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు భద్రత కల్పించకుండా రాత్రి 8 గంటలకు ఎఫ్‌ఆర్‌ఎస్ వెయ్యమని ఆదేశాలు జారీ చేయడం చాలా బాధాకరమన్నారు. ఢిల్లీ హైదరాబాద్ లాంటి నగరాల్లో లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతుంటే గ్రామీణ ప్రాంతాల్లో భద్రత లేని చోట పొలాల్లో, ఊరిబయట ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లలో 24 గంటలు ఎలా ఉండాలని మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వాపోయారు. ఆరు సంవత్సరాల నుంచి గ్రామీణ, కొండ ప్రాంత ప్రజలకు ఎంతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ క్యాన్సర్ స్క్రీనింగులు, ఎన్‌సీడీసీడీ స్క్రీనింగ్‌లు, టెలిమెడిసిన్ సేవలు, చిన్నపిల్లలు, గర్భిణులకు 12 రకాల సేవలు, 14 రకాల డయాగ్నోస్టిక్ టెస్టులు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను చిన్నచూపు చూడటం తగదని అన్నారు. తమ సమస్యలను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ పరిష్కరించాలని వేడుకున్నారు. రద్దు చేసిన ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లను శుభ్రం చేయడానికి కంటిజెంట్ వర్కర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లాలోని 538 కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏపీఎంసీపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంగళగిరి రాజేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీకాంత్, జిల్లా సెక్రటరీ గంటా ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షురాలు జీవన్‌జ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిలబడి మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

21న డీఈవో కార్యాలయం ముట్టడి

ఒంగోలు సిటీ: విద్యాశాఖ అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీ ఉమ్మడి ప్రకాశం జిల్లా డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ఏపీటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలతో ఐక్యవేదిక ఏర్పాటు చేశారు. వాకా జనార్దనరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో యూటీఎఫ్ నుంచి ఎస్‌కే అబ్దుల్‌హై, ఏపీటీఎఫ్ నుంచి డి.శ్రీనివాసులు, ఎస్టీయూ నుంచి కె.ఎర్రయ్య, ఏపీటీఎఫ్ 1938 నుంచి ఎస్.లక్ష్మీనారాయణ, ఏపీయూఎస్ నుంచి కె.మల్లికార్జునరావు, పీఆర్‌టీయూ నుంచి పి.శ్రీనివాసరావు, హెచ్‌ఎంఏ నుంచి వెంకటరావు, ఆర్‌యూపీపీ నుంచి రఘుబాబు, వైఎస్సార్ టీఏ నుంచి పి.రమణారెడ్డిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని ఏపీ పాఠశాల విద్యాశాఖ బలహీనపరచడాన్ని వ్యతిరేకిస్తూ ప్రకాశం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మే 21వ తేదీ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. 19వ తేదీ నియోజకవర్గ స్థాయిలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సన్నాహక సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. అన్ని సంఘాల మండల స్థాయి బాధ్యులు ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని జనార్దనరెడ్డి కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు శ్రావణకుమార్, చల్లా శ్రీనివాసులు, బి.రఘుబాబు, పి.వి.సుబ్బారావు, 9 సంఘాల జిల్లా శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ

హెచ్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు సిటీ: ప్రకాశం జిల్లాలోని ప్రధానోపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు టీఎల్ కాంతారావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ భవనంలో ప్రకాశం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. ఏకీకృత సర్వీసు అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎస్‌సీ పరీక్షలకు సంబంధించిన టీఏ, డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. ఎంఈఓ-1 ఖాళీ పోస్టులకు మండలంలోని సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వెంకటరావు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, కోశాధికారి జీఎస్సార్ సాయి, ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఎ.వెంకటేశ్వర్లు, పి.ఎ.పద్మనాభరావు, పి.ఎం.ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు

అప్పటి వరకు భానుడి భగ భగలు..అంతలోనే వాతావరణం చల్లబడటం..ఆపై ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు.. మధ్యలో మధ్యలో పిడుగుపాట్లు.. ఇవీ నెల రోజులుగా జిల్లాలో వాతావరణ పరిస్థితులు ఈ అకాల వర్షాలు, పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ల కింద సాగులో ఉన్న భూములు ఎండు ముఖం పట్టి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో గత నెల రోజుల వ్యవధిలో వందలాది ట్రాన్స్‌ఫార్మర్లు అకాల వర్షాలు, పిడుగుపాటుకు కాలిపోయాయి.


తమటంవారిపల్లిలో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


విద్యుత్ కార్యాలయంలో కాలిన ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్లపై పిడుగుపాటు.. రైతుకు చేటు

- నెల వ్యవధిలో భారీగా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు
- డిమాండ్‌కు తగ్గ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా కాక రైతులకు ఇక్కట్లు
- ఎండుతున్న ఉద్యానవన పంటలు, పశుగ్రాసం
- ఆందోళనలో రైతాంగం

కనిగిరిరూరల్: ట్రాన్స్‌ఫార్మర్లపై తరుచూ పిడుగు పాట్లు రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. గత నెల 10 నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే జిల్లాలో వందలాది ట్రాన్స్‌ఫార్మర్లు గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ రెండు నెలల్లో కాలిపోయాయి. వాస్తవానికి ప్రస్తుతం పంట సీజన్ తక్కువైనా పశుగ్రాసం, నిమ్మ, బత్తాయి తదితర లేట్ క్రాప్ పంటలకు నీటి అవసరం. అయితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో ఆ పంటలకు నీటి తడులు అందించలేక రైతులు అల్లాడుతున్నారు. ప్రధానంగా పశ్చిమ ప్రాంతం కనిగిరి నియోజకవర్గంలో పశుగ్రాసం సాగు చేసే రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.

వందల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు

విద్యుత్ సరఫరాల్లో అంతరాయాలు, ఇతరత్రా సమస్యలతో కొద్ది శాతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, ఏప్రిల్ చివరి వారంలో కురిసిన గాలివానకు అకాల పిడుగుపాట్లకు ఎక్కువశాతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోయాయి. జిల్లాలోని సీపీడీసీఎల్ పరిధిలో కనిగిరి, మార్కాపురం, ఒంగోలు, దర్శి, కందుకూరు విద్యుత్ డివిజన్‌లు ఉన్నాయి. దాదాపు అన్ని మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా.. అత్యధిక శాతం పశ్చిమ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. 25కేవీ, 16కేవీ, 15కేవీ, 63కేవీ తదితర రకాల ట్రాన్స్‌ఫార్మర్లు కనిగిరి విద్యుత్ డివిజన్‌లోని ఆరు మండలాల్లో 75 వరకు కాలిపోగా.. మార్కాపురం డివిజన్‌లో 13 మండలాల్లో 160కి పైగా, దర్శిలో 110కి పైగా, ఒంగోలు, కందుకూరు డివిజన్‌లలో మరో 200లకు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినట్లు తెలిసింది.


రాచగుండ్లపాడులో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్


ఎండుముఖం పట్టిన పశుగ్రాసం

పిడుగుపాటుకు కాలిన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు

మండలం	25కేవీఏ	16కేవీ ఏ	15కేవీఏ	మొత్తం
కనిగిరి రూరల్	9	17	-	26
హెచ్ఎంపాడు	12	6	-	18
పామూరు	7	4	-	11
సీఎస్‌పురం	4	4	2	10
వెలిగండ్ల	4	4	2	10
పీసీపల్లి	-	-	-	-
మొత్తం	36	35	4	75

రైతుల ఇక్కట్లు..

వాస్తవానికి ప్రస్తుత కాలంలో రబీ, ఖరీఫ్ సీజన్‌ల పంటల సాగు తక్కువగా ఉంటుంది. నిమ్మ, బత్తాయి, మిర్చి వగైరా ఉద్యాన పంటలతో పాటు, పశుగ్రాసం ఎక్కువగా సాగు చేస్తారు. యర్రగొండపాలెం, మార్కాపురం, దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లో పండ్లతోటలతో పాటు, పశుగ్రాసం సాగుపై రైతులు ప్రస్తుతం ఆధారితంగా ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షం, గాలివాన, పిడుగుపాట్లలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలాయి. దీంతో రైతులు ఆందోళనకు గురి కావాల్సి వచ్చింది.

డిమాండ్‌కు తగ్గట్లు లేని సరఫరా..

వాస్తవానికి ప్రతి ఎస్‌పీఎం పరిధిలో రోజుకు రెండు లేదా మూడు ట్రాన్స్‌ఫార్మర్లను మాత్రమే ఇవ్వగలరు. దీంతో రైతు అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు అందించలేకపోతున్నారు. కంపెనీ వారెంట్‌తో ఉన్న షిర్డీ సాయి ఏజెన్సీ వారు ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా విద్యుత్ డివిజన్‌లకు సరఫరా చేయలేదు. దీంతో విద్యుత్ డివిజన్‌ల పరిధిలో రోజువారీగా తయారయ్యే ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు, విద్యుత్ సిబ్బంది పోటీలు పడాల్సిన దుస్థితి. ఐదేళ్ల వారెంటీపై అందించిన ఏజెన్సీ వారు కడప నుంచి ఆయా విద్యుత్ డివిజన్‌లకు త్వరగా ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తే తప్ప రైతు సమస్య పరిష్కారం కాదు. వారెంటీగా తీసుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్లు దిగుమతి కాకపోవడంతో రైతులకు కరెంటు కష్టాలు వచ్చాయి. ఇటీవల కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రావడంతో సర్దుబాటు చేశారు.

ఎండుతున్న పంటలు..

జిల్లాలో పాడి ఆధారిత రైతులు అధికం. ప్రతి రైతు ఇంట్లో కనీసం జత మూగ జీవాలు ఉంటాయి. ప్రస్తుతం కనిగిరి నియోజవర్గంలో ప్రతి రైతు పొలంలో గడ్డి సాగులో ఉంది. హనుమంతునిపాడు, సీఎస్ పురం, వెలిగండ్ల మండలాల్లో నిమ్మ, బత్తాయి సాగులో ఉంది. దీంతో సకాలంలో నీటిని పంటలకు, గ్రాసానికి అందించాల్సిన పరిస్థితి. సుమారు 15 రోజుల నుంచి చాలా మంది రైతుల పొలాల ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలడంతో విద్యుత్ సరఫరా లేక పొలం తడుపుకునేందుకు నీరు లేక అల్లాడుతున్నారు. మూగ జీవాలకు అందించే గ్రాసం ఎండుముఖం పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, పిడుగుపాటుకు జిల్లా అంతటా ట్రాన్స్‌ఫార్మర్లు కాలినాయి. ప్రతి ఎస్‌పీఎం పరిధిలో రోజుకు రెండు మూడు ట్రాన్స్‌ఫార్మర్లకు మాత్రమే మరమ్మతులు చేసి రైతులకు ఇస్తున్నాం. ఐదేళ్ల వారెంటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు రెండ్రోజుల్లో కడప ఏజెన్సీ నుంచి వస్తాయి. అవి రాగానే ప్రాధాన్యత క్రమంలో రైతులకు అందజేస్తాం. పంటలకు ఇబ్బంది లేకుండా త్వరగా ట్రాన్స్‌ఫారాలు బిగించేలా చర్యలు తీసుకుంటాం.

– ఉమకాంత్, విద్యుత్ శాఖ ఈఈ

టీడీపీ శ్రేణుల దౌర్జన్యం

- అర్ధరాత్రి ఇంటి పిల్లర్ కూల్చివేత
- ఎవరు అడ్డువస్తారో చూస్తామంటూ బెదిరింపు
- రక్షణ కల్పించాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు


ఇంటి పిల్లర్ చువ్వలను ట్రాక్టర్ సాయంతో తొక్కేసిన దృశ్యం

మద్రిపూడి: అధికారం అండతో గ్రామాల్లో టీడీపీ శ్రేణులు రెచ్చిపోతున్నాయి. వివరాల్లోకి వెళితే మండలంలోని అంకేపల్లి పంచాయతీ పరిధిలోని సన్నమూరు గ్రామంలో సర్వే నంబర్ 29లో సెంటు నివాస స్థలం ఉంది. ఈ స్థలం గ్రామానికి చెందిన యర్రంవెట్టి శ్రావణికి చెందినది. ఈ స్థలానికి ప్రభుత్వం పొజిషన్ సర్టిఫికెట్ సైతం ఇవ్వడంతో ఇల్లు నిర్మించేందుకు భూమిపూజ కోసం గుంతలు తీసుకున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం శ్రేణులు మంచా రామయ్య కుమారుడు వెంకటేశ్వర్లు, మంచా కొండయ్య కుమారుడు వెంకటేశ్వర్లు పిల్లర్ కోసం తీసిన పునాదులను పూడ్చివేశారు. దీంతో శ్రావణి భర్త ఆంజనేయులు పొదిలి సివిల్ కోర్టులో దావా వేశారు. దీంతో కోర్టు ఇరువురికి నోటీసులు ఇచ్చింది. తెలుగుదేశం సానుభూతిపరులు లాయర్ చేత వకాల్తా వేయించారు. అయితే వారు వాయిదాకు వెళ్లకపోవడంతో కోర్టు శ్రావణికి పర్మినెంట్ ఇంజక్షన్ ఇచ్చింది. ఖర్చుల రూపంలో కూడా టీడీపీ శ్రేణులు రూ.4,218 కట్టాలని తీర్పు వచ్చింది. ఈ నేపథ్యంలో జడ్జిమెంట్ నకళ్లతో మాకు రక్షణ కల్పించాలని శ్రావణి భర్త ఆంజనేయులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే శనివారం రాత్రి శ్రావణి ఇంటి నిర్మాణం కోసం పిల్లర్లు ఏర్పాటుకు వేసిన ఇనుప చువ్వలను మంచా రామయ్య కుమారుడు వెంకటేశ్వర్లు ట్రాక్టర్ సహాయంతో కూల్చివేసి దౌర్జన్యానికి దిగాడు. బాధితుడు శ్రావణి, భర్త ఆంజనేయులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. విచారించి తగు న్యాయం చేయాలని ఆయన పోలీసులను వేడుకున్నారు.

పెళ్లి పేరుతో మోసం

ముండ్లమూరు(కురిచేడు): యువతిని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..మండలంలోని రమణారెడ్డిపాలెం గ్రామానికి చెందిన మణికంఠ తన ఇంటికి సమీపంలోని ఉన్న బంధువుల యువతిని ప్రేమిస్తున్నానని, వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించి ఏడాదిగా శారీరకంగా అనుభవించాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని యువతి ఒత్తిడి చేస్తున్నా దాటవేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో సదరు యువతి గర్భం దాల్చింది. ఈ విషయాన్ని మణికంఠకు చెప్పగా..ఎవ్వరికీ చెప్పవద్దని, పెళ్లి చేసుకుందామని చెబుతూ కాలయాపన చేశాడు. కానీ రోజులు గడుస్తున్నా మణికంఠ పెళ్లికి ముందుకు రాకపోవడంతో జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపింది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించగా యువతికి ఆరో నెల గర్భిణి అని తేలింది. దీంతో గ్రామపెద్దలు, బంధువుల సహకారంతో మణికంఠ వద్ద వెళ్లి అడగ్గా.. యువతి గర్భం రావడానికి నేను కారణం కాదని వివాహం చేసుకోనని చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై కమలాకర్ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో బంగారు ఆభరణాల చోరీ

మార్కాపురం: ఆర్టీసీ బస్సులో మహిళ బ్యాగ్‌లో 15 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి మార్కాపురం పట్టణంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..కొమరోలు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పచారీ ఈశ్వరమ్మ పట్టణంలో తన బంధువుల ఇంట్లో జరిగే వివాహానికి హాజరయ్యేందుకు కడప నుంచి మార్కాపురం వస్తున్న బస్సులో ఎక్కింది. పట్టణంలోని కంభం సెంటర్‌లో బస్సు దిగింది. అయితే ఆ తర్వాత బ్యాగ్‌లో దాచిన బంగారు ఆభరణాల చిన్న బ్యాగ్ కనిపించలేదు. దీంతో వెంటనే ఆమె తన బంధువులతో కలిసి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సైదుబాబు సిబ్బందితో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఒక మహిళ అదే బస్సులో కోర్టు సెంటర్లో ఆటోలో వెళ్లినట్లుగా గుర్తించి ఆ ఆటో డ్రైవర్, సదరు మహిళ కోసం గాలిస్తున్నారు. పోయిన బంగారు ఆభరణాల్లో చైన్ నల్లపూసల దండ, గాజులు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. ఈ కేసుపై పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య


జగదీష్ మృతదేహం

బేస్తవారిపేట: స్థానిక వాల్మీకీనగర్‌కు చెందిన యువకుడు ఆదిబోయిన్ జగదీష్(27) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..జగదీష్ బేస్తవారిపేట మండలంలోని పందిళ్లపల్లె టోల్‌ప్లాజాలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండటం, వివాహం చేయాలని కుటుంబసభ్యులను తీవ్ర ఒత్తిడి చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఉదయం బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తల్లి ఉమామహేశ్వరి, చుట్టుపక్కల వారు గమనించి తలుపు పగుల కొట్టి లోపలికి వెళ్లారు. జగదీష్‌ను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

దర్శి(కురిచేడు): అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం త్వరితగతిన న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరావు డిమాండ్ చేశారు. స్థానిక ఏపీటీఎఫ్ భవన్‌లో ఆదివారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆరు నెలల్లోగా బాధితులకు పూర్తిగా న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇచ్చిన హామీని నెరవేర్చుకునే బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు హనుమారెడ్డి, దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం రమేష్‌బాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్ కరుణానిధి, అసోసియేషన్ నాయకులు పి.నరసయ్య, సీహెచ్ ప్రసాద్, సీహెచ్ వెంకటేశ్వర్లు, పి.నారసయ్య, ఏవీ సుబ్బారావు, ఏ పూర్ణ, సీహెచ్ కొండయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల విక్రయ కేసులో నిందితుల అరెస్టు

- భూములను రూ.70 లక్షలకు విక్రయించిన ఘరానా మోసగాళ్లు
- ప్రధాన సూత్రధారులతో కలిసి మొత్తం 14 మంది అరెస్టు

పెద్దదోర్నాల: అసైన్డ్ భూములను మోసపూరితంగా విక్రయించిన కేసులో 14 మంది నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని ఐనముక్కల ఇలాఖాలోని కడపరాజుపల్లెకు చెందిన భూములను గతంలో నాగార్జునసాగర్ కాలువల కింద భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారంగా కేటాయించారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు తొలుత ఆ భూములపై శ్రద్ధ చూపలేదు. అయితే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడంతో భూముల ధరలు పెరిగాయి. దీంతో భూములు పొందిన లబ్ధిదారులు తిరిగి భూములను సాగు చేసేందుకు ప్రయత్నించగా భూములు తమ శాఖకు చెందినవంటూ అప్పట్లో అటవీశాఖ అధికారులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో సాంబశివారెడ్డి అనే వ్యక్తి పేరుతో భూములు పొందిన లబ్ధిదారులు లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో కొంత కాలానికి సాంబశివారెడ్డి, అతని భార్య అనసూయమ్మలు మరణించటంతో వారి వద్ద ఉన్న రైతుల డాక్యుమెంట్లు వారి సమీప బంధువైన పుల్లారెడ్డికి దొరికాయి. దీంతో అతని కన్ను ఆయా అసైన్డ్ భూములపై పడింది. ఎలాగైనా ఆ భూములను కొట్టేయాలన్న దురాశతో కొందరు వ్యక్తుల చేత అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేయించి 73 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని పామూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులకు రూ.70 లక్షలకు విక్రయించారు. ఈ క్రమంలో రైతు సదస్సులు జరుగుతున్న సమయంలో కొందరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆయా భూముల అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణకు అదేశించారు. దీంతో విచారణ చేసిన తహసీల్దార్ తన నివేదికలను కలెక్టర్‌కు పంపడంతో పాటు, పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకున్న ఎస్సై మహేష్ దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో భూముల అమ్మకంలో ప్రధాన సూత్రధారులైన పుల్లారెడ్డి, అతని కుమారుడైన ప్రభాకర రెడ్డి, అంకన్నలతో పాటు అక్రమ ఆధార్ కార్డులతో రిజిస్ట్రేషన్లకు సహకరించిన గోళ్లవిడిపి, వీరభద్రాపురం, చందవరం గ్రామాలకు చెందిన మరో 14 మందిని అదుపులోకి తీసుకొని మార్కాపురం కోర్టుకు తరలించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

20న ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలులో ఈ నెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో కేఎల్ గ్రూప్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, శ్రీచక్ర హ్యుండాయ్ కంపెనీలలో ప్యాకింగ్, సార్టింగ్, లోడింగ్, ప్రమోటర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ సెక్టార్‌లలో వివిధ రకాల ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏదైనా విభాగంలో ఐటీఐ, డిప్లమో, టెన్త్, ఇంటర్మీడియెట్, ఏదైనా డిగ్రీ అర్హతలు ఉన్న వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. జాబ్‌మేళా ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులు వారి అర్హత ఆధారంగా నెలకు రూ.10 వేల నుంచి రూ.19 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు ఉంటాయన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 29 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థులు ఆధార్‌కార్డు, ధ్రువీకరణపత్రాలు తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయం పనివేళల్లో 08592-281776 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అప్పుల బాధ తట్టుకోలేక యువకుడు ఆత్మహత్య

హనుమంతునిపాడు: అప్పుల బాధ తట్టుకోలేక యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నీలకంఠాపురంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కాటినేని వెంకటేశ్వర్లు కుమారుడు కాటినేని భూస్వామి(20) ఒరిస్సాలో బొరుగుల బట్టీ నిర్వహిస్తుంటాడు. ఇటీవల ఒరిస్సా నుంచి ఇంటికి తిరిగి వచ్చాడు. తిరుపతి కూడా వెళ్లి వచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనం చేసిన తరువాత గదిలో పడుకున్నాడు. ఆదివారం ఉదయం తల్లి చెన్నమ్మ ఎంత పిలిచినా పలకకపోవడంతో చుట్టుపక్కల వాళ్లను పిలిపిచించి తలుపు తీసి చూడగా ఫ్యాన్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చెన్నమ్మకు ఇద్దరు కుమారులు. మృతుడు పెద్ద కుమారుడు. తండ్రి వెంకటేశ్వర్లు కొంత కాలం క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లికి చేదోడుగా ఉంటూ కుటుంబ భారాన్ని మోస్తున్నాడు. ఒరిస్సాలో బొరుగుల బట్టీ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న కుమారుడు మృతితో తల్లి, కుటుంబసభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

దివ్యాంగులకు బదిలీల తిప్పలు

- ఉపాధ్యాయ బదిలీల్లో అన్యాయం
- వీరికి శాపంగా మారనున్న నిబంధనలు
- ప్రిఫరెన్షియల్ కేటగిరి ఎస్జీటీలకు బదిలీల్లో మోసం
- బదిలీలో నాలుగు స్థానాలు ఉన్నా ఒక స్థానానికే కేటాయింపు
- హైకోర్టును ఆశ్రయించిన ఉపాధ్యాయులు



ఒంగోలు సిటీ: ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి త్వరలో షెడ్యూలు విడుదలవుతుందనే ఆశతో ఉపాధ్యాయులు ఉన్నారు. ఈలోగా ప్రత్యేక అవసరాలు కలిగిన టీచర్లు బదిలీల కోసం మెడికల్ సర్టిఫికెట్లను తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. అయితే ప్రిఫరెన్షియల్ కేటగిరిలో బదిలీల విధివిధానాలు సక్రమంగా లేకపోవడంతో బదిలీల్లో తమకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను తగ్గించారని, సరిచేయాలని కోరుతూ దివ్యాంగ ఉపాధ్యాయులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు.

దివ్యాంగ ఉపాధ్యాయులపై కూటమి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోంది. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం తాజాగా రూపొందించిన నింబంధనలు వీరికి శాపంగా మారుతున్నాయి. వీరికి అనుకూలమైన చోట పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా నింబధనలు ఉన్నాయని, తమకు అన్యాయం జరుగుతుంది చెబుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వారు వాపోతున్నారు.

అంతా మోసమే..

జిల్లాలో సుమారు 500 మంది దివ్యాంగ ఉపాధ్యాయులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన బదిలీ చట్టంలో ప్రిఫరెన్షియల్ కేటగిరి సెకండరీ గ్రేడ్ టీచర్లకు భారీగా నష్టం కలగనుందన్న ఆరోపణలు ఉన్నాయి. బదిలీల్లో చూపిన ఖాళీల్లో ఎస్జీటీలు 40 శాతం మాత్రమే కోరుకోవాలన్న నిబంధనను ఎప్పుడూ లేనివిధంగా చట్టంలో చేర్చింది. దీనికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నాయకులు ఖండించకపోవడం దుర్మార్గమని దివ్యాంగ ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు . కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి వంతపాడడం దుర్మార్గమని ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా నలభై శాతం పోస్టులే అంటే కనీసం ఐదు పోస్టులు ఉంటేనే ప్రివరేన్షియల్ కేటగిరి ఎస్జీటీలకు రెండు ఖాళీలు దొరికే అవకాశం ఉంటుంది. రెండు, మూడు, నాలుగు ఖాళీల వరకు ఒకటి మాత్రమే వీరికి దక్కుతుంది స్కూల్ అసిస్టెంట్లకు కూడా 50 శాతం స్థానాలు మాత్రమే నిబంధన ఈ బదిలీ చట్టంలో చేర్చడంపై వారు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

ఎంతో దూరం ప్రయాణం చేయాలి..

గత ప్రభుత్వం ఏనాడు కూడా దివ్యాంగ ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టలేదు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం బాగా ఇబ్బంది పెడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొత్త బదిలీ విధానంతో శారీరక, ఆరోగ్యకరమైన లోపాలతో బాధపడేవారు దూరప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇది చాలా దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్న పట్టణాల్లో మూడు లేదా నాలుగు పాఠశాలలు మాత్రమే ఉంటాయి. దివ్యాంగులకు పాఠశాలకు ఒకరికి మాత్రమే ఇస్తే మిగిలిన వారు దూర ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వీరు ఆటోల్లోనూ బస్సుల్లోనూ ప్రయాణం చేసి పాఠాలు చెప్పాలి. ఇలా చేయడం వాళ్లను శారీరకంగా మానసికంగా ఇబ్బంది పెట్టడమే అవుతుందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిబంధనలు మార్చాలని ప్రభుత్వాన్ని కోరినా ఫలితం లేకపోవడంతో ఇటీవల వీరు కొందరు హైకోర్టు ఆశ్రయించారు. వారికి 8 సంవత్సరాలు పూర్తయిన అదే పాఠశాలలో కొనసాగించాలని హైకోర్టు స్టే ఇచ్చింది. ప్రస్తుతం వాళ్ల ఇష్టముంటే బదిలీలో పాల్గొనవచ్చు లేకపోతే అదే పాఠశాలలో కొనసాగవచ్చని స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన తుది తీర్పు జూలై చివర్లో రానుందని దివ్యాంగ ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి.

దివ్యాంగ ఉపాధ్యాయులకు నిబంధనలు తీసేయాలి



ప్రస్తుతం జరిగే బదిలీల్లో దివ్యాంగ ఉపాధ్యాయులకు ఎస్జీటీలకు 40 శాతం, స్కూల్ అసిస్టెంట్లకు 50 శాతం నిబంధన తీసివేసి అన్ని స్థానాల్లో కోరుకునే అవకాశం కల్పించి దివ్యాంగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– ధనిరెడ్డి వెంకటరెడ్డి, యూటీఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి, దర్శి డివిజన్

31న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఒంగోలు సిటీ: జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక పాత జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.